క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అరసవల్లి: 11 కె.వి.కలెక్టర్ ఆఫీస్ ఫీడర్, టూటౌన్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం నుంచి నగరంలో పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని టౌన్ డిప్యూటీ ఈఈ బగ్గు రాంబాబు తెలిపారు. ఈ మేరకు వాంబే కాలనీ, కలెక్టర్ ఆఫీస్ ఏరియా, డీఆర్‌డీఏ ఏరియా, కలెక్టర్ బంగ్లా ఏరియా, ఏపీహెచ్‌బీ కాలనీ, సాయిగిరి ఏరియాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. టూటౌన్ పరిధిలో డేఅండ్ నైట్ జంక్షన్, ఫారెస్ట్ ఆఫీస్ ఏరియా, రైతుబజార్ ఏరియా, చినబజార్ ఏరియా, ఎంపీడీఓ కార్యాలయ ఏరియా, పుణ్యపు వీధి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దకొంగరాంలో పశువైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: పెద్దకొంగరాం గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సాయి ప్రసాద్ వైద్య సేవలు అందజేశారు. చర్మ వ్యాధుల నియంత్రణ టీకాలు వేశారు. సీజనల్ వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, దూడల పెంపకం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతులు పాడి ఆవుల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న చేతన్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో మెరుగైన నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని హైదరాబాద్‌కు చెందిన అరవింద్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.ఎస్.చేతన్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో గురువారం ఇంజినీరింగ్ విద్య తరువాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అన్న అంశంపై ఒక్కరోజు అవగాహన తరగతులు నిర్వహించారు. ప్రతీ బ్రాంచ్‌లో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో అధికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విషయ, సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్ ఉండాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు అవసరమన్నారు. ఇంజినీరింగ్ మూడు, నాలుగు ఏడాది విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు అరవింద్, రూపేష్, ప్రిన్సిపాల్ రమణమూర్తి నాయుడు, ఫ్యాకల్టీ సభ్యులు జె.జనార్దనరావు, కె.సత్యం పాల్గొన్నారు.

ఆపదలో అండగా


చెక్కు అందజేస్తున్న దాత

శ్రీకాకుళం అర్బన్: లుకేమియా వ్యాధితో బాధపడుతున్న సీసాపు ఎల్లోరాకు చికిత్స అందించేందుకు శ్రీకాకుళం నగరంలోని అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ తమ వంతు సాయం అందించింది. తండ్రి కృష్ణారావుకు గురువారం రూ.25వేలు ఆర్థిక సహాయం ప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవాసంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆవేటి వారాలు



శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకాకుళం పట్టణంలోని పెద్దబరాటంవీధి, గైనేటి వీధిలో నీలమ్మతల్లి అమ్మవారి ఆవేటి వారాలు గురువారం ఘనంగా జరిగాయి. అర్చకులు పెంట కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారిని కూరగాయలు, వస్త్రాలు, పూలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని సాయి దర్బార్‌లో షిర్డీసాయినాథునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాకడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ జరిగింది. అనంతరం నిత్యాన్నదానం నిర్వహించారు.



● నేను సైతం

పర్యావరణ పరిరక్షణకు ఎల్లప్పుడూ ముందుండే జి.సిగడాం మోడల్ స్కూల్ ఇంగ్లిష్ అధ్యాపకుడు డి.హెచ్.సుబ్రహ్మణ్యం మరోసారి తన వితరణ గుణాన్ని చాటుకున్నారు. పాఠశాలకు తనవంతు బాధ్యతగా 50 మొక్కలను ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అధ్యాపకులు, విద్యార్థులకు గురువారం అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సుబ్రహ్మణ్యంను ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నాశామ్యుల్, అధ్యాపకులు అభినందించారు. – జి.సిగడాం



● ప్రత్యేక ఆధార్ డ్రైవ్

ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాలయం ఏఓ పీవీఎస్ రామ్మోహన్ గురువారం పరిశీలించారు. శుక్రవారం ధర్మవరం, బొంతలకోడూరు, ఎచ్చెర్ల, బడివానిపేటలో, శనివారం ఎస్ఎంపురం, ఎస్.ఎస్.ఆర్‌పురం, కుప్పిలి, అల్లినగరం, అల్లినగం–2 గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకు కొత్త ఆధార్‌లు జారీ చేస్తున్నామన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్



● ఆకట్టుకున్న వేషధారణలు

జి.సిగడాం మండలం పరిధిలో అద్వాన్నంపేట ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం కె.అరుణకుమారి ఆధ్వర్యంలో గురువారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా సాంస్కృతిక వేడకులు ఘనంగా చేపట్టారు. విద్యార్థులు పలు వినోద కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు సీతమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు. – జి.సిగడాం

ఇచ్చట కాకుంటే ఎచ్చట..?

- ఎక్కడ చూసినా నో పార్కింగ్ బోర్డులే
- పార్కింగ్ స్థలాలు లేక వాహనచోదకుల ఇక్కట్లు


బలగ కూడలి సమీపంలో ప్రయివేటు ట్రావెల్ బస్సులు నిలిపేయడంతో..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో వాహనచోదకులకు పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. జిల్లా నలుమూలల నుంచి వివిధ పనులు, అవసరాల నిమిత్తం వాహనాలపై వచ్చే వేలాది మంది ప్రజలకు ఎక్కడ చూసినా నో పార్కింగ్ పేరిట బోర్డులు దర్శనమిస్తుండటంతో తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, మార్కెట్లకు వచ్చే వాహనాలు నిలిపేందుకు అనువైన ప్రాంతాలు లేకపోవడంతో నో పార్కింగ్ పేరిట రూ.1035 చొప్పున చలానాలు కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రద్దీగా జీటీ రోడ్డు..

జీటీ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఉదయం పది గంటలకే సెంటర్ పార్కింగ్ నిండిపోతుంది. కొన్ని వాహనాలు ఎదురుగా ఉండే షాపుల యజమానులు, అందులో పనిచేసే సిబ్బందే పెట్టేస్తుంటారు. వాస్తవానికి ఎనిమిది గంటలకు మించి సెంటర్ స్టాండ్ పార్కింగ్‌లో వాహనాలు ఉంటే పోలీసులు గుర్తించి ఛలానాలు వేయాలి. మరోవైపు కొందరు యజమానులు షాపు ముందు ఉన్న అరుగు స్థలాన్ని కూడా వేరొకరికి అద్దెకిస్తూ సొమ్ము చేసుకోవడానికే ఆలోచిస్తున్నారు తప్ప షాపులకు వచ్చే వాహనాల పార్కింగ్ సమస్య పట్టించుకోవడం లేదురు. ఇదే పరిస్థితి పొట్టి శ్రీరాములు మార్కెట్‌లోనూ నెలకొంది.

ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో..

ఆర్టీసీ కాంప్లెక్సుకు 200 మీటర్ల దూరం వెలుపలే ప్రైవేటు వాహనాలు ఆపడానికి అనుమతి. కానీ ఉదయం, సాయంత్రం విద్యాసంస్థలు, కార్యాలయాలు తెరిచే, విడిచిపెట్టే సమయాల్లో ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు బలగ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుంటాయి. ద్విచక్రవాహనాలు, కార్లు, పనుల మీద వచ్చే ఆటోవాలాలు సమీప కోర్టు ప్రాంగణం, తహసిల్దారు కార్యాలయం, ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిలిపేస్తుంటారు. అదే ప్రాంతంలో కాంప్లెక్సు, జిల్లా కోర్టు గోడలను ఆనుకొని ఓ వైపు డ్రైనేజీ కాలువ, మరోవైపు పల్లపు ప్రాంతం బురద ఉండటంతో వాహనాలు స్కిట్ అయ్యి ప్రమాదాలు జరుగుతున్నాయి. జడ్జి బంగ్లా ఎదురుగా ఆర్టీసీ డిపో గోడకు ఆనించి ఉన్న మురుగుకాలువ సైడ్ వాల్ కడితే సుమారు ఆరడుగులు రోడ్డు వెడల్పు అయ్యే అవకాశముంది. కాంప్లెక్సు ఎదురుగా ఉన్న దుకాణాలు ముందున్నట్లుగా డ్రైనేజీ కాలువ ఎత్తుపెంచి వెడల్పైన పలకలు వేసి రోడ్డుకిరువైపులా నీరు నిలవకుండా చేస్తే సమస్య కొంత మేర పరిష్కారమవుతుంది. అరసవల్లి మిల్లు, రామలక్ష్మణ, సూర్యమహల్, పొట్టి శ్రీరాములు కూడళ్లను వెడల్పు చేస్తామన్న మున్సిపాలిటీ ప్రతిపాదనలు ఒక్క అరసవల్లి మిల్లు కూడలికే పరిమితమయ్యాయి. మిగతావి చేస్తే ఉపయుక్తంగా ఉంటుంది.


నోపార్కింగ్ బోర్డుతో ట్రాఫిక్ కానిస్టేబుల్

గుర్తిస్తాం..

ట్రాఫిక్ పోలీసులను సమన్వయం చేసుకుని అనువైన పార్కింగ్ స్థలాలను గుర్తిస్తాం. ప్రభుత్వానికి నివేదించి చర్యలు తీసుకుంటాం.
– చల్లా ఓబులేషు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

స్థలం కేటాయించాలి..

వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందిగా ఉంటోంది. పని కన్నా పార్కింగ్ పెట్టుకోవడానికే ఎక్కువ సమయం పడుతుంది. ప్రత్యేకంగా స్థలం ఉంటే ఇబ్బంది ఉండదు.
– ఎం.నాగరాజు, భైరి

నోటీసులిచ్చాం..

బయట పార్కింగ్‌కు అనుమతి లేని ఆసుపత్రులు, హోటళ్లు, షాపింగ్‌మాళ్లు, లాడ్జీల యాజమాన్యాలకు, ఫుట్‌పాత్ వ్యాపారులకు ఇప్పటికే నోటీసులిచ్చాం. ప్రజల సౌకర్యార్థం పార్కింగ్ ప్లేస్ ఉంటే బాగుంటుంది.
– ఎం.అవతారం, సీఐ, ట్రాఫిక్ పీఎస్, శ్రీకాకుళం

విలీన గ్రామాల్లో మంచినీటి సరఫరాకు రూ.106 కోట్లు

- మిర్తి బట్టి ఆధునీకరణకు రూ.40 కోట్లతో రీటెండర్లు
- రూ. 30 కోట్లతో సీవేజ్ ప్లాంట్ పూర్తికి ప్రణాళికలు
- సమీక్షలో ప్రత్యేకాధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


నగరపాలక సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరాభివృద్ధికి సాధ్యమైనన్ని ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల్లో రూ.106 కోట్లతో మంచి నీటి సరఫరా పనులను ప్రతిపాదించామన్నారు. వీటికి త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు. మొదటి దశలో పాత్రునివలస, పెద్దపాడు గ్రామాల్లో రూ.24 కోట్లతో ఇంటింటికి మంచి నీటిని సరఫరా చేసేందుకు టెండర్లు సిద్ధం చేశామన్నారు. రానున్న మూడు నెలల్లో నగరపాలక సంస్థ మొత్తం డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. అందులో భాగంగానే మిర్తిబట్టికి రూ.40 కోట్లతో పనులకు రీటెండర్లు పిలవడంతో పాటు సీవేజ్ ప్లాంట్ రూ.30 కోట్లతో తిరిగి పనులు ప్రారంభిస్తామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. డ్రైనేజీల నుంచి పూడిక తొలగింపు విషయంలో అలసత్వం వద్దన్నారు. 20 టన్నుల సామర్థ్యం గల మూడు టిప్పర్లను ఏర్పాటు చేసి చెత్తను కాపులుప్పాడ పవర్ ప్లాంట్‌కు తరలించాలని సూచించారు. ఖాళీగా ఉన్న ప్రైవేటు సైట్ల యజమానులకు నోటీసులు పంపించి పొదలు తొలగించాలని, వాటికి ప్రహరీలు కట్టించుకునేలా ప్రోత్సహించాలని, ఖాళీ స్థలాలకు పన్ను విధించాలని ఆదేశించారు. ప్రాపర్టీ పన్ను మొండిబకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. నీటి పన్ను పూర్తి స్థాయిలో వసూలు చేసి అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థకు ప్రతిరోజూ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే వారికి సిటిజన్ చార్టర్ ప్రకారం పని వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. శ్రీకాకుళం నగర సుందరీకరణ, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు, విహారానికి తగిన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. సమీక్షలో కమిషనర్ చల్లా ఓబులేసు, పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణాకరరావు, మున్సిపల్ ఇంజనీర్ గంగాధరరావు, ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవిన్యూ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ వీరుల త్యాగాలకు గుర్తుగా..


జాతీయ జెండాతో మానవహారం

శ్రీకాకుళం కల్చరల్: కార్గిల్ వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ బీజేపీ జిల్లా శాఖ యువ మోర్చా విభాగం ఆధ్వర్యంలో కాగడాలు, భారీ జాతీయ జెండాతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఏడురోడ్ల కూడలి నుంచి సూర్యమహల్ కూడలిలోని వివేకానందుని విగ్రహం వరకు అమర వీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ భారతమాతకు జేజేలు పలుకుతూ యువతలోని దేశభక్తిని పెంచేలా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కాగడాలు చేత పట్టుకొని ఎన్‌సీసీ క్యాడెట్లు, మాజీ సైనిక అధికారులు, ఉద్యోగులు, పౌరులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, ఎన్‌సీసీ 14 ఆంధ్రా బెటాలియన్ ముఖ్య అధికారి మేజర్ వంగా మహేష్, మాజీ సైనిక సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి, టీడీపీ నాయకులు పీఎంజే బాబు, నాగావళి కృష్ణ, పి.సతీష్, జనసేన ప్రతినిధులు కిశోర్, రమణ పాల్గొన్నారు

పరామర్శ..


రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని చిన్నమురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, చిన్నమురపాక ఎంపీటీసీ సభ్యుడు సిరిపురపు రాంబాబు తండ్రి అయ్యప్ప అనారోగ్యంతో మృతి చెందారు. ఎంపీటీసీ రాంబాబు కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకుడు రొక్కం బాలకష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, అలుపన నారాయణ రెడ్డి, బొంతు సూర్యనారాయణ, పీఏసీఎస్ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, దేశెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి


కరపత్రం ఆవిష్కరిస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వాకర్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్, డాక్టర్ మధు విలేఖరి పిలుపునిచ్చారు. నగరంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో న్యూ ఆదిత్య వాకింగ్ క్లబ్, జుంబా డ్యాన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 28న మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో క్లబ్ ప్రతినిధులు ఆవిష్కరించారు. వాకర్లంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జి.సిగడాం: ఈ నెల 26వ తేదీన మండలంలోని బాతువ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేస్తామని విద్యుత్ శాఖ ఏఈఈ తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పున్నాం, ఉల్లివలప, డీఆర్‌వలస, ముషినివలస, రౌతుపేటతోపాటు మరో ఐదు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామన్నారు.

రణస్థలం మండలంలో రేపు..

రణస్థలం: ఈ నెల 27వ తేదీన మండలంలోని పైడిభీమవరం సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ బయ్యన్నాయుడు గురువారం ఒక ప్రకటన తెలిపారు. పైడిభీమవరం, నారువ, వరిసాం, సరగడిపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

లారీ డ్రైవర్‌కు గాయాలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని సుభద్రాపురం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆగి ఉన్న లారీని శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బెంగుళూరుకు చెందిన లారీ డ్రైవర్ ఆహమ్మద్ కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన లారీ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఏఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు


రోడ్డును పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది.

సాక్షి ఎఫెక్ట్...

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని వరంకాలనీ సత్యసాయినగర్–7వ లైన్‌లో రోడ్డు సరిగా లేక నీరు నిలిచిపోవడంతో 'చినుకుపడితే నడకయాతన' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు నిర్మాణం జరగకపోవడానికి కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని సూర్యమహల్ సమీపంలో ఉమెన్స్ కాలేజీ మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడిని వెనుకగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో కాకివీధికి చెందిన వెల్లాల కుమారస్వామికి గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

బడుల్లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలు


విద్యార్థినులతో ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బడుల్లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మా జ్యోతిభాపూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు బావిభారత పౌరులుగా ఎదగాలని.. ఏక్‌భారత్–శ్రేష్ఠభారత్‌గా గుర్తించగలగాలని పిలుపునిచ్చారు.

బడ్జెట్‌లో మహిళారంగానికి పెద్దపీట


మాట్లాడుతున్న బీజేపీ మహిళా మోర్చా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాలు, రంగాలకు సమాన అవకాశాలను కల్పించిందని.. ముఖ్యంగా మహిళలకు పెద్దపీట వేసిందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగి లక్ష్మీరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, నరసన్నపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఎ.భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం శ్రీకాకుళంలో బీజేపీ మహిళా మోర్చా తరఫున కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి, మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యంపై ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలసీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపేందుకు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రబడ్జెట్ జనరంజక బడ్జెట్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.మనెమ్మ, సౌత్ మండల జనరల్ సెక్రెటరీ ఎస్.సరళ, మోహిని, గుణమ్మ, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక దినోత్సవం


వివిధ వేషధారణల్లో విద్యార్థులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరులశాఖ రూపొందించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా గత కొద్ది రోజులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. బోధనా పరికరాల తయారీ ప్రదర్శన, బోధన, ఫౌండేషన్ విలరీస్ న్యూమరీస్‌లో భాగంగా అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడల ఆవశ్యకతను తెలిపారు. శారీరక దారుఢ్యతను పెంపొందించటంలో భాగంగా క్రీడలను పోత్సహించారు. ఉధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం

ఎచ్చెర్ల క్యాంపస్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, అమ్మకాలు, సరఫరా వంటివి కంట పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎచ్చెర్ల ఎస్‌ఐ ఎస్.చిరంజీవి సూచించారు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం మాదక ద్రవ్యాలు వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులను లక్ష్యంగా ఎంచుకుని కొంతమంది గంజాయి, హెరాయిన్, కొకై న్ వంటి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారని, ఇటువంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు.